


చెస్ పోటీలకు లాస్యశ్రీ ఎంపిక

ప్రజాశక్తి - కడప

జాతీయ బాలికల అండర్ -15 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కడప నగరంలోని గాంధీనగర్ పాఠశాలల్లో ఏడవ తరగతి చదువుతున్న మట్టం లాస్య శ్రీ ఎంపికైనట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీష్ దర్బారి తెలిపారు. ఈనెల 7 నుంచి 10 వరకు గుంతకల్ నగరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ -15 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ అండ్ సెలక్షన్స్‌లో బాలిక 4వ స్థానం సాధించిందని చెప్పారు. ఈ టోర్నమెంట్లో 8 రౌండ్లకు గాను లాస్య శ్రీ 6 పాయింట్లు సాధించడం విశేషమన్నారు.



చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రజలు జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు .తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ ఆదివారం ఎన్‌టిఆర్ కూడలిలో కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రెడ్డప్పగారి గారి మాధవి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్, హరి ప్రసాద్, రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ మాజీ సభ్యులు పీరయ్య, రాంప్రసాద్, కొమ్మలపాటి సుబ్బరాయుడు, జిలాని బాష, వెంకటేష్, రామలక్ష్మమ్మ, దియావుద్దీన్, రంతు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగన్ ఎన్ని రాజకీయ కుట్రలు చేసినా, తెలుగుదేశం పార్టీ పడి లేచిన కెరటంలా ఎగిసి ప్రజాదరణ పొందుతుందన్నారు. సుపరిపాలన చేతగాని జగన్, కుట్రలతో అరెస్టులు చేయించి జైళ్లను నింపుతున్నారని విమర్శించారు.ఎన్ని కుట్రలు చేసినా న్యాయస్థానంలో నిర్దోషిగా చంద్రబాబు నిరూపణ అవుతారని ఆయన అన్నారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి మాట్లాడుతూ జగన్ పాలన తుగ్లక్ పాలనను తలపిస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయించి జగన్ రాక్షస ఆనందం పొందుతున్నారని, అక్రమ అరెస్టులపై నిప్పులు చెరిగారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శులు బాలిశెట్టి హరిప్రసాద్, గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎఫ్ఐ ఆర్‌లో లేని చంద్రబాబు పేరును అరెస్టుకు ముందు ఎలా చేర్చారని ప్రశ్నించారు. 16 నెలలు అక్రమార్జన కేసుల్లో జైల్లో ఉన్న జగన్, బాబాయ్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఎంపీ అవినాష్ రెడ్డి బయట తిరుగుతున్నారని, ఆయన పెట్టుకున్న బెయిల్ రద్దవుతుందని జోస్యం చెప్పారు. అక్రమ కేసులు కోర్టులో నిలువ లేవన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, 2024 లో చంద్రబాబుకు పట్టం కడతారన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, అమీర్, బిట్ట శ్రీధర్, కాసిం, రవికుమార్, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.



కడప : దీక్షలు ఉద్దేశించి మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు నిరసన దీక్ష చేపట్టాయి. నెహ్రూ రోడ్ లోని తన కార్యాలయంలో నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి అక్కడ నిరసన దీక్ష చేపట్టారు. చంద్రబాబు నాయుడును రాజకీయ కక్షతోనే ప్రభుత్వం తప్పుడు కేసుల్లో ఇరికించి ఇబ్బందులు గురిచేస్తుందని, ఈ విధమైన చర్యలు ప్రజాస్వామ్యానికి మంచిది కాదంటూ నంద్యాల వరద రాజులరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సి పల్ చైర్మన్ ఆసం రఘురాం రెడ్డి, శ్రీని వాసులరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : దీక్షలు చేస్తున్న భూపేష్‌రెడ్డి, నాయకులు

జమ్మలమడుగు రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసనగా జమ్మలమడుగు ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జమ్మలమడుగు పాత బస్టాండ్ ఆవరణంలో సామూహిక నిరాహార దీక్ష చేపటారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చేలా జగన్మోహన్ రెడ్డి పరిపాలన ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి కేవలం పగ ప్రతీకారాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేసే ఉద్దేశం లేదని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి మాట్లాడుతూ అధికార దాహంతో అధికారంలోకి వచ్చి అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాలను, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. సాయంత్రం దీక్షను విరమించారు. అంతకుముందు సిపిఐ నాయకులు వెంకట సుబ్బారెడ్డి, జనసేన నాయకులు అల్లం సూరి భూపేష్ రెడ్డి నిరహాదీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ రెడ్డి, పోలీట్ బ్యూరో సభ్యుడు ఆర్ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, సీనియర్ నాయకులు ద్వారకచర్ల కాటిరెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వర రెడ్డి, ఎస్టీ నాయకులు హనుమంతు నాయక్, దువ్వూరు మురళి, తులసిరెడ్డి, భూసిరెడ్డి, అన్నెబోయిన కొండయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, క్లస్టరు, యూనిట్, మండల, గ్రామ, వార్డు,కార్యవర్గ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. సామూహిక నిరాహార దీక్షలకు సిపిఐ పార్టీ వారు సంఘీభావం తెలిపినారు.

అన్నదాతలను విస్మరిస్తే ఆహార సంక్షోభం తప్పదు

25న రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాల్లో ధర్నాలు జయప్రదం చేయండి

జిల్లా విస్తృత సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- కడప అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలం చెందిందని, అన్నదాతలను విస్మరిస్తే ఆహార సంక్షోభం తప్పదని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని , ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2+50 శాతం ఫార్ములాకు అనుగుణంగా అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతులను ఆదుకుని ఆత్మ హత్యలను నివారించాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు నుంచి వ్యవసాయాన్ని మినహాయించి వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాల వల్ల రైతులకు రక్షణ లేకుండా పోయిందని, వ్యవసాయం నిలవాలంటే రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని అన్నదాతలను ప్రభుత్వాలు విస్మరిస్తే దేశంలో ఆహార సంక్షోభం తప్పదని హెచ్చరించారు. కరువు రైతాంగ సమస్యలపై ఈ నెల 10 నుంచి 20 వరకు గ్రామాల పర్యటనలు నిర్వహిస్తున్నట్లు అక్కడ వచ్చిన సమస్యలపై సచివాలయల్లో కేంద్రాలలో వినతి పత్రం ఇవ్వాలని రైతు సంఘం నాయకులకు తెలిపారు. అనంతరం ఈనెల 25న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విస్తృత సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాలకృష్ణయ్య, దస్తగిరి రెడ్డి, అన్నమయ్య జిల్లా రైతు సంఘం నాయకుడు నాగబసిరెడ్డి, జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులరెడ్డి, చిన్న సిద్దయ్య, రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

'కుడా' ఉన్నతీకరణే లక్ష్యం

- అక్రమ లేఅవుట్లపై చర్యలు
- రూ.5 కోట్ల జరిమానా వసూలు
- జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్‌ల రిజిస్ట్రేషన్ల జోరు
- కుడా వైస్ చైర్మన్ వై.ఓబులేసునందన్ వెల్లడి

కడప అర్బన్ అథారిటీ (కుడా) ఉన్నతీకరణే లక్ష్యం. ఇందులో భాగంగా మొదటిసారిగా ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయడమైంది. ఇక్కడి నుంచి కుడాఅభివృద్ధి వేగవంతం అవుతుంది. ఆర్నెళ్లుగా అక్రమ లేఅవుట్లపై చర్యలకు శ్రీకారం చుట్టాం. ఇందులో కొంతమేర పురోగతి సాధించడంతో రూ.ఐదు కోట్ల జరిమానా వసూలు చేశాం. ఉమ్మడి కడప జిల్లాలోని నాలుగు వేల పైచిలుకు పంచాయతీలు, మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రణాళికా సంబంధిత అంశాలు, భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్లకు అనుమతులు, మాస్టర్‌ప్లాన్స్, భూవినియోగ మార్పు, జోనల్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ పరిధిలోని నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించామని పేర్కొంటున్న కడప పట్టణ అథారిటీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కె.ఓబులేసునందన్‌తో ప్రజాశక్తి ముఖాముఖి...

- ప్రజాశక్తి - కడపప్రతినిధి



ముఖా ముఖి..

కడా పురోగతికి తీసుకున్న చర్యలేమిటి?

కడప పట్టణాభివృద్ధి (కుడా) సంస్థ ఆధ్వర్యంలోని 400 అక్రమ లేఅవుట్లను గుర్తించాం. ప్రొద్దుటూరు, పోరుమామిళ్ల, బద్వేల్, రాయచోటి, రైల్వేకోడూరు ప్రాంతాల్లో అత్యధిక అక్రమ లేఅవుట్లను గుర్తించాం. ఈమేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడమైంది. ఇందులోభాగంగా సుమారు రూ.ఐదు కోట్ల మేర ఆదాయం సమకూరింది.

'కుడా' అభివృద్ధి మార్క్ మాటేమిటి?

కడప పట్టణాభివృద్ధి (కుడా) సంస్థ పరిధిలో మొదటిసారిగా ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయడమైంది. ఈనేపథ్యంలో కడాలో అక్రమ లేవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకున్న నేపథ్యంలో జరిమానా రూపంలో వచ్చిన రూ.ఐదు కోట్ల ఆదాయాన్ని రూ.1.40 కోట్లతో కోటిరెడ్డి సర్కిల్, ఏడురోడ్ల కూడలి అభివృద్ధి, వీరపునాయునిపల్లి మండల పరిధిలోని అనిమెల- పాయ సంపల్లి మధ్య రూ.50 లక్షలతో రహదారి పనులు, రూ.20 లక్షలతో దువ్వూరు మండల పరిధిలోని తెలుగుగంగప్రాజెక్టు పార్క్, రూ.2 కోట్లతో ప్రొద్దుటూరులో క్లాక్‌టవర్, రూ.2 కోట్లతో బద్వేల్‌లో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడమైంది.

కుడా' పరిధిని వివరించండి?

ఉమ్మడి కడప జిల్లాలోని 5392.26 స్క్వేర్ కిలోమీటర్ల మేర విస్తరించింది. కడప, అన్నమయ్య జిల్లాల పరిధిలోని పది అసెంబ్లీల పరిధిలోని కడప మినహా మిగిలిన తొమ్మిది అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని నాలుగు వేలకుపైగా పంచాయతీలు, తొమ్మిది మున్సిపాలిటీల పరిధిలోని భవన నిర్మాణాల లేఅవుట్లు, ఇతర అభి వృద్ధి పనులను కడా పరిధిలోకి తేవడం తెలిసిందే.

కడప మాస్టర్‌ప్లాన్ సందేహాల మాటేమిటి?

కడప, ప్రొద్దుటూరు, పులివెందుల మాస్టర్‌ప్లాన్స్ పబ్లిష్ చేయడమైంది. ఇందులో కడప కార్పొరేషన్ మాస్టర్‌ప్లాన్‌పై తలెత్తిన సందేహాలను త్వరలోనే నివృత్తి చేస్తాం. ఆర్‌వి అసోసియేట్స్ ఏజెన్సీ రూపొందించింది. ఆర్‌వి అసోసియేట్స్ ఏజెన్సీ, కార్పొరేషన్, కడా లతో సంయుక్త సమావేశాల ద్వారా అవగాహన కల్పించడం జరుగు తుంది. ఈమేరకు కడప మాస్టర్‌ప్లాన్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమైంది.

కుడా ప్రాధాన్యతను గురించి తెలపండి?

రాష్ట్రంలోని మూడు అథారిటీల్లో కడప అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఒకటి. ఇందులో ప్రధానంగా గుంటూరులోని ఎపి సిఆర్‌డిఎ, వైజాగ్‌లోని విఎంఆర్‌డి తర్వాత కుడా మూడో స్థానంలో నిలిచింది. కుడా జిల్లా భవిష్యత్ ప్రణాళికలను ప్రభావితం చేసే అవకాశం ఉందని చెప్పవచ్చు.

అక్రమ లేఅవుట్లపై చర్యల గురించి తెలపండి?

ఉమ్మడి జిల్లాలో సుమారు 400 భవన నిర్మాణ లేఅవుట్లు ఉన్నాయి. ఇందులో 100 అక్రమ లేఅవుట్లను గుర్తించడమైంది. ఈమే రకు అక్రమ లేఅవుట్ల నిర్వాహకుల నుంచి స్వల్ప వ్యవధిలో రూ.5 కోట్ల జరిమానా విధించడమైంది. అక్రమ లేఅవుట్ల నివారణలో భాగంగా జరిమానాలను విధించడంతోపాటు పరిస్థితిని బట్టి కోర్టుల్లో పిల్ వేసే అవకాశాలు కూడా ఉంటాయనే విషయాన్ని అక్రమార్కు లు గుర్తుంచుకోవాలి.

ఎంఐజి అవుట్ల పురోగతిపై మీకామెంట్?

రాష్ట్రంలోనే అత్యధిక లేఅవుట్లను ఏర్పాటు చేసిన గుర్తింపు లభించింది. అత్యాధునిక వసతులతో అతి తక్కువ, న్యాయమైన ధరలతో అందుబాటులో ఉంచుతున్నాం. ఇందులోభాగంగా రాయచోటి ఫేజ్-1లో 297, ఫేజ్-2లో 230, రైల్వేకోడూరులో 200, రాజం పేటలో 105, బద్వేల్‌లో 284, ప్రొద్దుటూరులో 484 ప్లాట్లు వెరసి 1600 ప్లాట్లను అందుబాటులో ఉంచుతాం. త్వరలో రాజంపేట ఫేజ్-2, కడపలోనూ ఎంఐజి లేఅవుట్లు అందుబాటులోకి రానున్నాయి.

జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్ గురించి వివరించండి?

ఉమ్మడి జిల్లాలోని మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని అందుబాటు ధరల్లో జగనన్న టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయడమైంది. ఈమేరకు జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జగనన్న టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇందులోభాగంగా జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, బద్వేల్ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన జగనన్నటౌన్‌షిప్ లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఊపందుకుంది. రాబోయే రోజుల్లో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల నియోజకవర్గ కేంద్రాల్లో జగనన్న టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేస్తాం.

ఆత్మహత్యలు వద్దు బతికి సాధిద్దాం : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 'బాగా చదవండి..ఆత్మహత్యలు వద్దు.. బతికి సాధిద్దాం..' అనే పోస్టర్‌ను కడప డిఎస్‌పి షరీఫ్ చేత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏదోఒకచోట విద్యార్థులు, యువత, రైతులు తొందర పాటు నిర్ణయ తో ఆత్మహత్య లు చేసుకుని తనువు చాలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగాకుటుంబ సభ్యులు ఆనాథలు అవుతున్నారని తెలిపారు. ఆత్మహత్యల నివారించాలనే ఉద్దేశంతో పిఎస్‌యు ఆధ్వర్యంలో అనేక సదస్సులు నిర్వహించి విద్యార్థులను, యువతను చైతన్యం చేయడం చాలా మంచి కార్యక్రమమని అభినందించారు. కళాశాల విద్యార్థులు చెడు అలవాటులకు బానిసలుగా మారి బైకులలో వేగంగా ప్రయాణించి రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారని తెలిపారు. వారికి కూడా అవగాహన కల్పించేవిధంగా కార్యక్రమం చేయాలని పిలుపునిచ్చారు. పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి నాలుగు నెలలలోనే రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల విద్యార్థులు తమ విద్యాసంస్థలలో ఒత్తిడి కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారని చెప్పారు. ఆత్మహత్యలు ఆపాలంటే ప్రతి విద్యా సంస్థలలో సైకాలజిస్ట్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సదస్సులో సెమినార్లు నిర్వహించి విద్యార్థులు, యువతను చైతన్యం చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, గోపి, ఆర్‌వైఎఫ్ రాష్ట్ర నాయకులు నరసింహ పాల్గొన్నారు.

నూతన సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -పోరుమామిళ్ల టౌన్



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

పట్టణంలో నూతన సచివాలయాన్ని ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా, ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పరిపాలన అందుబాటులోకి తీసుకొచ్చారని చెప్పారు. 14 రకాల సేవలను సచివాలయ వ్యవస్థలోకి తీసుకొచ్చారని తెలిపారు. 1,40,000 మందికి యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు. పరోక్షంగా రెండు లక్షల 50 వేల మందికి పైగా గ్రామ వాలంటీర్లను నియమించారన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ పింపిపి సి.బాష, సి రాజశేఖర్, అల్లా, ఎంపిటిసిలు, పోరుమామిళ్ల వార్డు సభ్యులు వైఎస్ఆర్సిపి నాయకులు, ప్రజలు, ప్రభుత్వ అధికారులు, పాల్గొన్నారు.

ఫొటో :నూతన సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

అధ్వానంగా రహదారి

పట్టని అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-కాశినాయన

మండల కేంద్రమైన నర్సాపురంలోని ప్రధాన రహదారిపై మోకాళ్లలోతు గుంతలు పడి ప్రజలకు ఇబ్బందిగా మారింది. నిత్యం రాకపోకలు సాగించే అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ వీటిపై దృష్టి సారించకపోవడం దారుణమని ప్రజలు వాపోతున్నారు. నరసాపురం నడి ఊరిలో, నరసాపురం-ఓబులాపురం ప్రధాన రహదారిపై ఎక్కడపడితే అక్కడ గుంతలు ఏర్పడి ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నరసాపురం మీదుగా దాదాపు 10 గ్రామాల ప్రజలు ఆ దారిలో వెళ్లాల్సి ఉంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు పలు ప్రమాదాలకు గురైన సంఘటనలున్నాయి. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచని పరిస్థితిలో ప్రజలున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పరిస్థితి ఇలాగే ఉందని, వర్షమొచ్చినప్పుడు సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని, పలుమార్లు ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని పేర్కొంటున్నారు. జిల్లా అధికారులైన స్పందించి నర్సాపురం రహదారిలో ఉన్న నీటిని తొలగించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయమైన రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపునీరు

జాతీయ లోక్ అదాలత్‌లో 13,239 కేసులు పరిష్కారం

- అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌లో 13, 239 కేసులు పరిష్కరించి రూ. 21.90 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించినట్లు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్ ఆదివారం వెల్లడించారు. జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో అందరి సహకారంతో జిల్లావ్యాప్తంగా 13239 కేసులు పరిష్కరించి రాష్ట్రంలో జిల్లా ఎనిమిదవ స్థానంలో నిలిచిందని తెలిపారు. జాతీయాల్లో కాదాలతో జిల్లా వ్యాప్తంగా 24 బెంచీలను ఏర్పాటు చేసి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. 12,342 క్రిమినల్ కేసులు, 304 సివిల్ కేసులు, 593 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారం చేసినట్లు తెలిపారు. కడపలో 4270 కేసులు, ప్రొద్దుటూరు లో 1232 , రాజంపేటలో 519, రాయచోటిలో 843, బద్వేల్‌లో 2365, జమ్మలమడుగులో 1631, సిద్ధవటంలో 219, రైల్వేకోడూరు లో 265, పులివెందులలో 692, నందలూరులో 563, లక్కిరెడ్డిపల్లిలో 262, కమలాపురంలో 378 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన అందరికీ ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గీత, ఆయన తెలియజేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతుశాస్త్రంను బోధించడానికి అర్హత కలిగినటువంటి అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు వారి బయోడేటా ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని ఈనెల 11న ఉదయం 11 గంటలకు జరిగే ఇంటర్వ్యూకి హాజరు కావలసిందిగా కోరారు. వివరాలకు 9849765838, 9441689606లలో సంప్రదించాలన్నారు.

మహిళలు, యువతకు ఆదర్శం..చాకలి ఐలమ్మ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - బద్వేలు



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, రజక చిట్యాల చాకలి ఐలమ్మను మహిళలు, యువత ఆదర్శంగా తీసుకోవాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. ఆదివారం చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని స్థానిక బద్వేల్ డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తి గ్రామంలో 1895లో ఐలమ్మ జన్మించారని చెప్పారు. సెప్టెంబర్ 10 1985లో మరణించారని, యుక్త వయసులో ఆనాటి నైజాం నవాబు పాలనలో పేదల పంటలను వారి శ్రమను దోచుకుంటున్న పెత్తందారులకు భూస్వాములకు, దొరలకు, రజాకారులకు ఎదురు తిరిగి పోరాడన్నారన్నారు. దున్నేవాడిదే భూమి పండించే వాడికే పంట అని పెత్తందారులను. భూస్వాములను తరిమి తరిమి కొట్టిన పోరాట యోధురాలు చాకలి ఐలమ్మన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి దొరల భూములను పేదలకు పంపిణీ చేయించిన ఘనత ఆమెదేనన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంధిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆమె స్ఫూర్తితో నేటి మహిళలు యువతి యువకులు పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి గంగనపల్లి నాగార్జున, పట్టణ నాయకులు ఆంజనేయులు, బాల గురయ్య, సురేంద్ర, ఇమ్మానేలు, రాయప్ప, నరసింహ, సుబ్బరాయుడు, రాజగోపాల్, సుబ్బయ్య పాల్గొన్నారు. **పూలే ఆశయ సాధన ఆధ్వర్యంలో :** పట్టణంలోని అంబేద్కర్ భవనమునంలో వీరనారి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు రజక చిట్యాల ఐలమ్మ 38 వ వర్ధంతి కార్యక్రమం పూలే ఆశయ సాధన సమితి, అంబేద్కర్ భవన కార్యనిర్వహణ కమిటీ, ఆవాజ్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బద్వేలు గురుమూర్తి, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు నారాయణ, అంబేద్కర్ కార్య నిర్వాహక కమిటీ అధ్యక్షులు బండి జకరయ్య, పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు పిచ్చయ్య, యాదవ ఉద్యోగ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రమేష్ యాదవ్, ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాన్‌బాష, ఆవాజ్ కమిటీ బద్వేలు కార్యదర్శి అన్వర్‌బాష, దళిత నాయకులుకేశవ, మునెయ్య, ప్రసాద్, బాల ఓబయ్య పాల్గొన్నారు.

వన్నె తరగని తెలుగు తేజాలు 'విశ్వనాథ', 'వడ్డాది'

ప్రజాశక్తి - కడప అర్బన్

జ్ఞానపీఠ పురస్కారం పొందిన తొలి తెలుగు కవి విశ్వనాథ సత్యనారాయణ, చిత్రకళా ప్రతిభతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన వడ్డాది పాపయ్య వన్నె తరగని తెలుగు తేజాలని వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'కవిసమ్రాట్' విశ్వనాథ సత్యనారాయణ 129వ జయంతిని, ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య 103వ జయంతిని నిర్వహించారు. విశ్వనాథ సత్యనారాయణ, వడ్డాది పాపయ్య చిత్రపటాలకు పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ 20వ శతాబ్దంలోని తెలుగు సాహిత్యానికి, ప్రత్యేకించి సంప్రదాయ సాహిత్యానికి విశ్వనాథ పెద్ద దిక్కన్నారు. ఆయన చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదని, కావ్యాలు, కవితలు, నవలలు, నాటకలు, పద్యకావ్యాలు, విమర్శలు, వ్యాసాలు, కథలు వంటివి అసంఖ్యాకంగా రచించారన్నారు. ఆయన రాసిన రామాయణ కల్పవృక్ష కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారం లభించిందని చెప్పారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించగా, ఆంధ్ర ప్రభుత్వం ఆస్థానకవిగా నియమించి గౌరవించిందన్నారు. వడ్డాది పాపయ్య తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో ఆయన దగ్గరే చిత్రకళను క్షుణ్ణంగా నేర్చుకున్నారన్నారు. ఆ తర్వాత రాజా రవివర్మ చిత్రకళా తపస్సును ఆదర్శంగా ఎంచుకున్నారన్నారు. పాపయ్య చిత్రించిన ఎగురుతున్న హనుమంతుడు, పార్వతి, శకుంతల, లక్ష్మి, ధనలక్ష్మి, శివపార్వతులు, మొదలైనవి చిత్రకళా జగత్తులో ఆయనకు సుస్థిరస్థానాన్ని సంపాదించిపెట్టాయన్నారు. పాపయ్య రేరాణి, అభిసారిక, భారతి, చందమామ, యువ తదితర పత్రికల్లో పనిచేసి తన కళాప్రతిభతో వాటి స్థాయిని పెంచారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, విశ్రాంత తెలుగు పండితులు కె.రాజారెడ్డి, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు



మాట్లాడుతున్న షేక్ సలీం

స్వతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్వతంత్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, ఇందుకు మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) కృషి చేస్తుందని యంపిజె రాష్ట్ర కార్యదర్శి షేక్ సలీం అన్నారు. ఆదివారం కడపలో జరిగిన రాయలసీమ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యంపిజె ఆశయాలు, లక్ష్యాలు కార్యకర్తల ముందుంచారు. రాష్ట్ర సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ షేక్ ఖదీర్ మాట్లాడుతూ ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సామాన్య ప్రజలకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆహారం, మానవ హక్కులపై ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి ప్రతి ఒక్కరికీ అందించినపుడే మంచి ఫలితం ఉంటుందన్నారు. కడప జిలా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి మాట్లాడుతూ సమిష్టి కృషి చేస్తే సాధ్యమవుతుందన్నారు.

నేడు మైదుకూరు పురపాలక కార్యాలయ నూతన భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ నూతన కార్యాలయ భవనాన్ని సోమ వారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర ఆధ్వర్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సభ్యు లు, అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.



గ్రామోత్సవంలో ఆంజనేయస్వామి, ఆకట్టుకున్న కోలాటం

వైభవం.. అంజన్న గ్రామోత్సవం

ప్రజాశక్తి - చక్రాయపేట

గండి క్షేత్రంలో ఆంజనేయ స్వామి గ్రామోత్సవం శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రావణమాసోత్సవాలు చివర శనివారం కావడంతో ప్రతి ఏడాది ప్రకారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రధాన అర్చకులు కేసరి స్వామి, రాజా స్వాములు భక్తులు అలరించేలా పలు రకాల పూలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, కేరళ వాయిద్యాలు, గుడిపాటి సన్నాయి, బాణసంచా పేలుస్తూ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ చంద్రమౌళి పర్యవేక్షణలో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అనంతరం ఆస్థానం ఏర్పాటు చేసిన దాతలకు, అతిధులకు, అధికారులకు ఘనంగా సన్మానించారు. గ్రామోత్సవంలో సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐ రంగనాథ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

అంజన్నను దర్శించుకున్న ప్రముఖులు

గండి వీరాంజనేయ స్వామిని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, రాఘవరెడ్డితోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిని ఆలయ మర్యాదలతో దేవస్థాన సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ పినుబోలు రాఘవేంద్ర ప్రసాద్ సత్కరించారు.

అన్నదానానికి రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి చిట్వేలి మండలం సిద్దారెడ్డిపల్లె సర్పంచు నాగనబోయిన ప్రభాకర్ ధర్మపత్ని సుబ్బ రత్నమ్మ రూ.50,116 విరాళం ఇచ్చారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అల వలపాటి ముకుందరెడ్డి తెలి పారు. ఆలయ అర్చకులు కేసరి, రాజా స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందించారు.



ఎసికి నగదు అందిస్తున్న దాతలు

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని సానిపాయి గ్రామంలో మండల జనసేన నాయకులు గుగ్గిళ్ళ నాగార్జున ఆధ్వర్యంలో 230 మంది జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు రాజంపేట జనసేన నాయకులు అతికారి దినేష్ చేతుల మీదుగా ఆదివారం సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తాతంశెట్టి నాగేంద్ర, ముఖరం చాంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, కడప జనసేన పార్టీ ఇంచార్జ్ సుంకర శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. మొదట సానిపాయి చెక్ పోస్ట్ దగ్గర నుంచి ఏర్పాటుచేసిన ర్యాలీలో నాయకులందరూ పాల్గొని అక్కడి నుంచి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం జనసేన క్రియాశీలక సభ్యులకు సభ్యత్వ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అతికారి దినేష్ ఆధ్వర్యంలో సానిపాయికి చెందిన వైసిపి, టిడిపి పార్టీల నుంచి యాభై కుటుంబాలు జనసేన పార్టీలో చేరారని చెప్పారు. అతికారి దినేష్ మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని కార్యక్రమం క్రియాశీలక సభ్యత్వం జనసేనపార్టీ ద్వారానే సాధ్యమైందని తెలిపారు. ప్రతి జన సైనికుడికి వారి కుటుంబ సభ్యులకు అండగా ఉండాలన్నదే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉద్దేశ్యమన్నారు. జనసేన పార్టీ అధికారంలో లేకపోయినా, జన సైనికులకు వారి కుటుంబాలకు ఏదైనా ప్రమాదవశాత్తు జరిగినా, రూ.5లక్షల బీమా, ప్రమాద బీమా 50వేల రూపాయలు ఆరోగ్య బీమా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీర మహిళలురెడ్డి రాణి, రూప, జనసేన పార్టీ నాయకులు జోగినేని మనీ, ఓబులేసు, గుగ్గిళ్ళ వెంకటేష్, నేతి వెంకటేష్, నాగరాజ, ఓబులయ్య, పఠాన్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలో ఒడిసిలవంకలో క్రికెట్ టోర్నమెంట్‌ను వైసిపి నాయకులు ఆవుల నాగభూషన్ రెడ్డి, వైస్ ఎంపిపి యధుభూషణ్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ చదవుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు దేహ దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసా నికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి, ఉమాపతిరెడ్డి, చిన్నరెడ్డి, వెంకటాద్రి, తంగళ వెంకటేశ్వరులు, మైనార్టీ నాయకుడు యూత్ నిజాముద్దీన్, మేడికల్ స్టోర్ అమీన్, బ్రాహ్మానందరెడ్డి, పేరంపల్లి సర్పంచ్ హర్షకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

చీనీ రైతులకు గిట్టుబాటు ధర లభించేనా?

మూడోసారి పులివెందుల మార్కెట్ యార్డులో ప్రారంభమైన కొనుగోళ్లు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న చీనీ కాయలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నియోజవర్గ కేంద్రమైన పులివెందులలోని మార్కెట్ యార్డులో ఆదివారం ఎట్టకేలకు చీనీ కాయల కొనుగోలును ప్రారంభించారు. గతంలో ఇదే మాదిరిగా రెండుసార్లు కొనుగోలు ప్రారంభించినా అనతి కాలంలోనే రైతులకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడం, ఇతరత్రా కారణాలతో రైతులు తమ దిగుబడులను యార్డ్‌కు తీసుకెళ్లడం మానుకున్నారు. అయితే పది రోజుల క్రితం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే పులి వెందుల నియోజవర్గంలోని మార్కెట్ యార్డ్, సింహాద్రిపురం మండలంలోని గురజాలలో చీనీ రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై సూట్ లేకుండా కొనుగోలు నిర్వహించి రైతులకు మంచి ధర లభించేలా చేస్తామని ప్రకటించారు. దీంతో పులి వెందులలో ఎట్టకేలకు ముచ్చటగా మూడోసారి కొనుగోలును ప్రారంభించారు.

సూటు వద్దు-ట్రేడింగ్ ముద్దు

మార్కెటింగ్, ఉద్యానశాఖ సమన్వయంతో సూటు వద్దు-ట్రేడింగ్ ముద్దు అంటూ కరపత్రాలను సైతం ముద్రించి రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని పులివెందుల నియోజవర్గంలో దాదాపు 63 వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. ఇప్పటివరకు రైతులు తమ చీనీ కాయలను దళారులను ఆశ్రయించి విక్రయిస్తున్నారు. దళారులు ప్రతి పది టన్నులకు 2.5 టన్నులు సూట్ పేరుతో ఉచితంగా తీసుకోవడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సొంత నియోజవర్గమైన పులివెందులలో సూటును పూర్తిగా రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు సూచించి కొనుగోలును ప్రారంభించారు. పులివెందుల ప్రాంతంలోని చీనీ కాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండడంతోపాటు, కాయలు నాణ్యతగా బాగుంటాయని అధికారులు, వ్యాపారస్తులు చెబుతున్నారు. పులివెందుల ప్రాంతంలో చీనీ కాయలు బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీకి స్థానిక వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు.

ప్రముఖ కంపెనీలను ఆహ్వానిస్తే మరింత మేలు

పులివెందుల ప్రాంతంలోని చీనీ కాయలను ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు కొనుగోలు చేస్తే మరింత మంచి ధర లభించే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. విదేశాలకు సైతం ఎగుమతి అయ్యే చీనీ కాయలు మన ప్రాంతంలో ఉన్నాయని, ఆ దిశగా ప్రభుత్వాలు అడుగులు వేయాలని రైతులు కోరుతున్నారు. ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రముఖ మార్కెట్లలో మంచి ధరలు లభిస్తున్నప్పటికీ రైతులు నేరుగా విక్రయించడానికి వెళితే అక్కడి మండీదారులు ధరలు తక్కువగా వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అదే వ్యాపారులకు, రైతులకు టన్నుపై రెండు నుంచి ఐదు వేల వరకు తక్కువగా ధరలు లెక్క కట్టి పట్టిలేస్తున్నారు. ఈ కారణంగా రైతులు స్థానిక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. పులివెందులలోని మార్కెట్ యార్డులో పూర్తిస్థాయిలో కొనుగోలు జరిగితే చీనీ రైతులు తమ దిగుబడులను అమ్ముకోవడం మరింత సులభతరం కానుంది.

సూట్ రద్దు నిర్ణయం మంచిదే



సూట్ రద్దు చేస్తూ ప్రభుత్వం పులివెందులలో చీనీ కాయలు కొనుగోలు చేయడం మంచి నిర్ణయం. అయితే వ్యాపారస్తులు సూటు లేదన్న కార ణంగా ధరలు తగ్గించి కొనుగోలు చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- గంగాధర్‌రెడ్డి, చీనీ రైతు, గురజాల

మద్దతు ధర రూ.30 వేలకు పెంచాలి



గత కొన్నేళ్లుగా దళారుల చేతిలో చీనీ రైతులు తీవ్రంగా నష్టపో తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీసం మద్దతు ధర రూ.14 వేల నుంచి రూ.30,000 పెంచాలి. ప్రస్తుతం కూలీలు, ఎరువులు, క్రిమిసంహార మందుల ఖర్చులు పెరిగాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని కనీస మద్దతు ధరను పెంచాలి. ఈ మద్దతు ధర ప్రకారం కాయలు కొనుగోలు చేస్తేనే రైతులకు లాభం.

- జగన్మోహన్‌రెడ్డి, రైతు సంఘం నాయకుడు, తిమ్మాపురం

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఈనెల 8న (శుక్రవారం) అంబకపల్లె సమీపంలో ఉన్న పొలంలో అదే గ్రామ టిడిపికి చెందిన చింతకాయల నాగరాజు అనే వ్యక్తి హత్యకు సంబంధించి ఆరుగురిని అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజు తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగరాజు హత్య కేసుకు సంబంధించి ఆయన తండ్రి సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామన్నారు. అన్ని కోణాల్లో విచారించామని, ఈ హత్యకు కారణం వివాహతరమే సంబంధమే అని తెలిసిందన్నారు. బి.చెన్నకేశవులు, బి.చందు, బి.చెన్నకృష్ణ సమీప బంధువైన మహిళతో నాగరాజు అక్రమ సంబంధం పెట్టుకోవడం జరిగిందని, దీనికి సంబంధించి కూడా 2018లో పులివెందులలో నాగరాజు వివేకానంద స్కూల్ పరిసర ప్రాంతంలో నివాసం ఉన్నప్పుడు చందు, చెన్నకేశవులు అక్కడికి వెళ్లి ఇకనుంచి మా అక్క జోలికి రావద్దని చెప్పారన్నారు. దీన్ని వ్యతిరేకరించిన నాగరాజు వేటకొడవళ్లతో చెన్నకేశవ చేతి వేళ్ళను నరికాడని, అలాగే మిగతా వారిపై దాడి చేసేందుకు కూడా ప్రయత్నించాడని తెలిపారు. ఆ మేరకు అప్పట్లో పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో నాగరాజుపై 307 కేసు కూడా నమోదైందన్నారు. ఆ కేసుకు సంబంధించి ఆగస్టు 21న నాగరాజుపై సాక్షిగా సాక్ష్యం చెప్పాలని చందు వాళ్ళ అక్కతో చెప్పాడని, తాను నాగరాజుపై చెప్పలేనని, అతన్ని పెళ్లి చేసుకున్నానని ప్రస్తుతానికి కడుపుతో ఉన్నానని ఆమె నిరాకరించిందన్నారు. దీంతో కోపంతో వారు గ్రామంలో మా పరువు తీశావంటూ అసహనంతో అప్పటి నుండి ఒక పథకం ప్రకారం నాగరాజును హతమార్చాలని కాచుకొని ఉన్నారని డిఎస్‌పి తెలిపారు. ఈనెల 8న నాగరాజు తన తోట వద్దకు వెళు తున్నాడని వీరికి తెలియడంతో వారు అక్కడ వేచి ఉండి ద్విచక్ర వాహనంపై వస్తున్న నాగరాజును గొడ్డలి, కత్తులతో నరకడంతో కిందపడి కొద్దిదూరం వెళ్ళగానే మళ్లీ నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. నాగరాజు తండ్రి సూర్యనారాయణ 9 మంది అనుమానితులపై ఫిర్యాదు చేశారని, ఈ కేసుకు సంబంధించి బి.చెన్నకేశవులు, బి.చందు, బి.చెన్నకృష్ణ, బి.చంద్రాయుడు, బి.గంగన్న, బి.గోపాల్‌ను ఆదివారం పులివెందుల ముదిగుబ్బ రోడ్డులోని పాలెం బస్టాప్ వద్ద పులివెందుల రూరల్ సిఐ బాల మద్దిలేటి, లింగాల ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో అరెస్టు చేశారని తెలిపారు. వారివద్ద నుంచి గొడ్డలి, వేటకొడవళ్లు స్వాధీనం చేసుకున్నారని డిఎస్‌పి వివరించారు. అనంతరం వారిని విచారించగా తమ బంధువైన మహిళ అక్రమ సంబంధం పెట్టుకుందని, అందుకే అతన్ని హతమార్చామని చెప్పారన్నారు. కార్యక్రమంలో తొండూరు ఎస్ఐ హనుమంతు ఉన్నారు,



విలేకరులతో మాట్లాడుతున్న డిఎస్‌పి నాగరాజు

చీనీకి తెగుళ్లు..ఎండుతున్నచెట్లు



వైరస్‌తో ఎండి పోతున్న చీనీ చెట్లు

ప్రజాశక్తి - వేంపల్లె

రైతులు ఆరుగాలం కష్టపడడంతోపాటు లక్షలు ఖర్చు పెట్టి పెంచుకున్న చీనీ చెట్లు వైరస్‌తో ఎండిపోతున్నాయి. వాటిని బతికించుకునేందుకు రైతులు అల్లాడిపోతున్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో చీనీ తోటలను దాదాపు 2,200 ఏకరాల్లో రైతులు సాగు చేశారు. చీనీ పంటలకు వైరస్ సోకడంతో కాపునకు వచ్చే చెట్లు ఎండి పోతున్నాయి. కాపాడుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు వాడుతున్నా, ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. వేంపల్లె పంచాయతీలోని చింతలమడుగు పల్లెకు చెందిన పఠాన్‌హసన్ అనే రైతు 5 ఎకరాల్లో చీనీ పంటను సాగు చేసి 500 చెట్లు పెంచుతున్నాడు. ఇందులో దాదాపు 150 చెట్లు వింత వైరస్‌తో ఎండి పోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆంజనేయరెడ్డి అనే రైతు 10 ఎకరాల్లో చీనీ చెట్లు సాగు చేశాడు. చెట్లు ఎండి పోతుండడంతో మళ్లీ కొత్తగా చీనీ మొక్కలను నాటుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి అనే రైతు కూడా ఆరెకరాల్లో చీనీ చెట్లు సాగు చేయగా మొత్తం ఎండిపోవడంతో మళ్లీ మొక్కలు తెచ్చి నాటాడు. ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు చెట్లకు మందులు పిచికారీ చేసిన ఫలితం లేదని రైతులు వాపోతున్నారు. చెట్లకు వైరస్ సోకడంతో చెట్టు పూర్తిగా ఎండి పోతున్నట్లు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం చీనీ చెట్లకు కాపు ఉన్నప్పటికీ ఓ వైపు ధరలు తగ్గి పోవడంతోపాటు మరో వైపు చెట్లు ఎండి పోతున్నాయని రైతులు అంటున్నారు. ఇటీవల కాలంలో విద్యుత్ కోతలతోపాటు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో చెట్లు ఎండి పోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకులు మడత పడి రోజురోజుకు చెట్లు ఎండు దశకు చేరుతున్నట్లు వాపోతున్నారు. వందల కుటుంబాలు చీనీ చెట్లు పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. చీనీ కాయలకు కూడా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు నష్టాలు వస్తున్నట్లు వాపోతున్నారు. ఎండి పోయిన చీనీ చెట్లను ఏమి చేయాలో తెలియక రైతులు తొలగిస్తున్నారు.

150 చెట్లు ఎండిపోయాయి



అయిదెకరాల్లో వేసిన చీనీ చెట్లల్లో దాదాపు 150 వైరస్ వల్ల ఎండిపోయాయి. ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. కాపు ఉన్న దశలో ఒక వైపు ధరలు లేక పోవడంతో పాటు మరో వైపు పచ్చని చీనీ చెట్లు ఎండి పోతున్నాయి. డబ్బులు ఖర్చు అవుతున్న చెట్లు మాత్రం బ్రతకం లేదు. ప్రస్తుతం చీనీ టన్ను ధర రూ 10 వేల నుండి 12 వేల వరకు మాత్రమే ఉందని గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. ఎండి పోతున్న చీనీ చెట్లుకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

- పఠాన్ హసన్, రైతు, చింతలమడుగుపల్లె

చిరస్మరణీయులు సిద్దయ్య : 'ఒంటేరు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ(ఎస్‌ఎల్‌టిఎ)ను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసిన ఘనత విద్వాన్ ఎసి సిద్దయ్యకు దక్కుతుందని భాషోపాధ్యాయసంఘ గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం సిద్దయ్య సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భాషా పండిత వ్యవస్థను రద్దు చేసి వారికి వెట్టి చాకిరీ నుండి విముక్తి కలిగించడానికి సిద్దయ్య సంకల్పించారన్నారు. సుదీర్ఘకాల పోరాటాల ఫలితంగా సాధించిన ఉన్నతీకరణ ఫలాలను పొందడంలో సిద్దయ్య వేసిన బీజం ఎనలేనిదని కొనియాడారు. రాష్ట్ర భాషోపాధ్యాయసంస్థ రాష్ట్ర అధ్యక్షులు అంకాల్ కొండయ్య మాట్లాడుతూ భాషా పండితుల సంక్షేమానికి సిద్దయ్య గట్టి పునాది వేశారని తెలిపారు. చినుకు చినుకు కలిసి సముద్రం అయినట్లు ఒక కేడర్ సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా బలమైన సంఘంగా నిర్మించడంలో విశేషకృషి చేశారని ప్రశంసించారు. కోశాధికారి బొగా గంగాధర్ మాట్లాడుతూ సిద్దయ్య వ్యవస్థాపకుడుగా మొదలైన ఒక సంఘం రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది భాషాపండితుల కలను నెరవేర్చిన గొప్ప సంఘంగా ఆవిర్భవంచడంలో సిద్దయ్య పాత్ర చిరస్మరణీయమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు వారాది మధు, జింకా శేఖర్, వెన్నపూస రామసుబ్బారెడ్డి, చాంద్‌బాషా, బాబా, సుధాకర్, ఓబులేసు, ప్రసాద్ పాల్గొన్నారు.



సిద్దయ్యను స్మరించుకుంటున్న సభ్యులు

అసాంఘిక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు

అమలులో 144 సెక్షన్ : ఎస్ఐ రామకృష్ణ

ప్రజాశక్తి - పెద్దముడియం

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టు నేపథ్యంలో రక్షణ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎలాంటి అసాంఘిక ఘటనలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని టిడిపి మద్దతుదారుల ధర్నాలు, రాస్తారోకులకు అనుమతి లేదన్నారు. మండల, గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక ఘటనలు జరిగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలిగించరాదని ఎస్ఐ రామకృష్ణ కోరారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

వినాయక ఉత్సవాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతి పొంది నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ చంద్ర మోహన్ పేర్కొన్నారు. గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారు మండల పోలీస్ స్టేషన్‌లో విగ్రహ వివరాలు, నిర్వాహకుల వివరాలు, నిమజ్జనం చేసే తేదీ, సమయం, ప్రదేశం, వివరాలు తెలిపి అనుమతి పొందాలన్నారు.డిజె, మైక్‌సెట్ ఏర్పాటుకు డిఎస్‌పి అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జ నం సమయంలో మండలంలో ఎటువంటి ఆహ్వానించిన సంఘటనలు జరగకుండా పోలీస్ పటిష్ట బందోబస్తు ఉంటుందని పేర్కొన్నారు.గణేష్ విగ్ర హాలను ప్రధాన రహదారులు, ప్రజలు తిరిగే రోడ్లపై, వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్‌కు ఎలాంటి అడ్డంకులు కలిగించకుండా ప్రతిష్టించే విధంగా చూడాలని ప్రజలను కోరారు.



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్ రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో చంద్రబాబు, ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజల కోసం తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా భయపడేది లేదని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో ఆదివారం ప్రవీణ్ విలేక రులతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టుపై పోలీసు వ్యవస్థ ప్రవర్తించిన తీరును తప్పుపట్టారు. త్వరలో లోకేష్ బాబు, అచ్చం నాయుడుని కూడా అరెస్టు చేయవచ్చునని ఆయన తెలిపారు. రాత్రి 2 గంటల సమయంలో పోలీసులు టిడిపి నాయకులను అరెస్టు చేశారని, చట్టం పట్ల గౌరవం కలిగిన తమ నాయకుడు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులకు సహకరించారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా నడుచుకున్నారన్నారు. అలాంటి తమ నాయకుడిపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. తమ నాయకుడి అరెస్టు తమకు బాధను కలిగిస్తోందన్నారు. రాబోవు రోజుల్లో మరింత చురుగ్గా పార్టీ కోసం పనిచేసి ప్రొద్దుటూరులో టిడిపి జెండా ఎగరవేస్తామని ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఉత్తమారెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఉత్తమారెడ్డి మళ్లీ ఆదివారం బాధ్యతలు తీస్వకరించారు. మూడు నెలల క్రితం ఆయన బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తామన్నారు. అందరితో కలిసిపోతనని తెలిపారు.

పెళ్లి వేడుకలో మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి పంచాయితీ కుప్పగట్టుపల్లె గ్రామంలో ఆదివారం మోహన్ పెళ్లిలో రాజకీయ సందడి కనబడింది. మోహన్ చాలాకాలంగా టిడిపి కార్యకర్తగా పని చేస్తున్నాడు. ఆయన వివాహానికి చక్రాయపేట టిడిపి మండల ఇన్‌ఛార్జి తాళ్లపల్లి మహేశ్వర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై అనర్హత వేటు తప్పదు

ప్రజాశక్తి - చాపాడు

మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుపై స్కిల్ డెవలప్ మెంట్ కేసు లో తప్పకుండా శిక్ష పడు తుందని, తద్వారా రాబోయే సార్వత్రిక ఎన్ని కల్లో పోటీ చేయ కుండా అనర్హత వేటు పడుతుందని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పేర్కొ న్నారు. చాపాడులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 12 కేసుల్లో చంద్రబాబు దోషిగా ఉండి స్టేలతో తప్పించుకు తిరు గుతున్నారని ఆరోపించారు. ఎసిబి అధికారులు అన్ని ఆధారాలతోనే చంద్ర బాబును అరెస్టు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహసారధుల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

నియోజకవర్గ పరిధిలోని పెనగలూరు మండలం పొందులూరు గ్రామ పంచాయతీలోని చక్రంపేట హైస్కూల్‌లో ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిధున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గల్ఫ్ కో-కన్వీనర్ గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో మహిళలు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని మహిళలకు చీరెలు అందించారు. కార్యక్రమంలో గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, కువైట్ కన్వీనర్ బాల్‌రెడ్డి, కో-కన్వీనర్, నర్సారెడ్డి, మైనార్టీ సభ్యులు రహమతుల్లా, యూత్ సభ్యుడు సబాదర్, జడ్‌పిటిసి సుబ్బరాయుడు, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న జడ్‌పి చైర్మన్ ఆకేపాటి

నేడు ఎంపీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలో సోమవారం రాజంపేట పార్లమెంట్ సభ్యులు పి.వి.మిథున్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.మహ్మద్‌మాలిక్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. పేదలకు అన్నదానంతో ఆటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. **నిమ్మనపల్లి :** రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ఎంపీ పివి.మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ.రమణారెడ్డి తెలిపారు. మండలంలోని వైసిపి నాయ కులు, కార్య కర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.